క్లుప్తంగా

కళాశాల అభివృదిపై చర్చ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఎస్వీజీఎం ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి పలు అంశాలపై చర్చించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈనెల 21,22 తేదీల్లో న్యాక్ బృందం కళాశాలలో పర్యటించనున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. కళాశాల అభివృద్ధి, వివిధ అంశాలపై పూర్వ విద్యార్థులతో చర్చించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. న్యాక్ బృందం పర్యటనలో పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కళాశాలకు నాక్ నుంచి మంచి గ్రేడ్‌లు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాక్ కోఆర్డినేటర్ సూర్య నాగిరెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ మల్లికార్జున, అలూమ్నీ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, రాధాకృష్ణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

బొమ్మనహాళ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి అన్నారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గన్యా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా దోమల తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ వర్క్‌షాప్ జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: విజయవాడలో సెప్టెంబర్ 3,4,5 తేదీల్లో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొత్రేష్ కోరారు. శనివారం స్థానిక ఏపీఎన్జీవో భవనంలో వర్క్‌షాప్ కరపత్రాలను విడుదల చేశారు. సమాజంలో పెరుగుతున్న గంజాయి, మత్తుపదార్థాల వినియోగం, మహిళలు, బాలికలపై అత్యాచారాలపై వ్యతిరేక పోరాటాలు, చైతన్య కార్యక్రమాలు, విద్యా రంగ సమస్యలపై అవగాహన సదస్సులు నిర్వహించే దిశగా మూడు రోజుల పాటు వర్క్‌షాప్‌లు జరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి యువతీయువకులు, యువజన సమైక్య కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కుమార్‌నాయక్, దినకర్, మాధవ్, చరణ్, బాలాజీ, హనుమంతు, లోహిత్, మనోజ్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు 'దుర్గం' విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని శ్రీలతను అభినందిస్తున్న అధ్యాపకులు

కళ్యాణదుర్గం: ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరగనున్న స్వాతంత్య్ర వేడుకలకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తరఫున కళ్యాణదుర్గం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని శ్రీలత ఎంపికైంది. శనివారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థిని శ్రీలత ఎంపిక కావడం గర్వకారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి అన్నారు. ఎర్రకోటలో జరిగే వేడుకల్లో మార్చ్‌ఫాస్ట్, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో శ్రీలత పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ శ్రీధర్, రవిశంకర్ విద్యార్థినిని అభినందించారు. అధ్యాపకులు సూర్యనాగిరెడ్డి రాధాకృష్ణ, గురుమోహన్, సుధాకర్ పాల్గొన్నారు.

14న ద్విచక్రవాహనాల వేలం

కణేకల్లు: కణేకల్లు సెబ్ పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమ మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 14న వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ మురళీకిశోర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

హోటల్లో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ఓ హోటల్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఎర్రిస్వామి హోటల్ నిర్వహిస్తుండేవాడు. రెండు రోజులుగా హోటల్ తెరవలేదు. శనివారం వచ్చి చూడగా హోటల్ తలుపులు తెరిచి ఉన్నాయి. హోటల్లో ఉన్న ఫ్రిజ్, కిరాణా సరుకులు, సిలిండర్ ఎత్తుకెళ్లారని, రూ.35వేలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

టమాట పంట..తెగుళ్లతో తంటా

- టమాట పంటకు మచ్చ, బూడిద, ఆకు ముడత తెగుళ్లు
- మందులు పిచికారీ చేసినా తగ్గుముఖం పట్టని వైనం
- కళ్లెదుటే పంట దెబ్బతింటోందని కంట తడి పెడుతున్న రైతులు


అంతరగంగలో తెగుళ్ల బారిన పడిన టమాట పంట

కూడేరు: వేరుశనగ సాగు చేసి, ఏటేటా నష్టాలు చవిచూస్తున్న రైతులు..తక్కువకాలంలో అధిక ఆదాయంతోపాటు దిగుబడినిచ్చే ప్రత్యామ్నా పంటల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. ప్రతి ఇంట్లో వంట చేయాలంటే టమాట ఉండాల్సిందే.. దీంతో మార్కెట్‌లో ధర కూడా ఆశించిన స్థాయిలో ఉంది. అయితే పంటకు మచ్చ, బూడిద, ఆకు ముడత తెగుళ్లు వ్యాపించి, రైతులను ఆందోళన కలిగిస్తున్నాయి. మందులు పిచికారీ చేసినా తగ్గుముఖం పట్టకపోవడంతో, కళ్లెదుటే పంట దెబ్బతింటోందని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ధరను చూసి సాగుపై మక్కువ..

టమాటను ఎక్కువ శాతం వంటలకాల తయారీలో వాడుతారు. గత రెండేళ్లలో టమాటకు మార్కెట్లో విపరీతంగా రేటు పెరగడంతో కాసుల పంట పండి లక్షాధికారులైన రైతులున్నారు. అధిక పెట్టుబడి పంటలను సాగు చేయడం కన్నా బోరు బావుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్నా డ్రిప్ సహాయంతో తక్కువ పెట్టుబడి గల టమాట పంటను సాగు చేయడానికి రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.

ఎకరా సాగుకు రూ.40 వేల పెట్టుబడి..

ఒక ఎకరా విస్తీర్ణంలో 13 నుంచి 14 వేల టమాటా మొక్కలు నాటుతారు. సాధారణ రకం టమాట మొక్కలైతే నర్సరీలో 30 నుంచి 50 పైసల ధర ఉంటుంది. సాహిత, యోధ, సాహో, 4481178 వంటి వెరైటీ టమాట మొక్కలైతే 50 నుంచి 80 పైసలు వరకు ఉంటుంది. ఒక ఎకరా విస్తీర్ణంలో పంట కోత దశకు వచ్చేంత వరకూ మొక్కలు, డ్రిప్, మందులు, కూలీలతో కలిపి పెట్టుబడి సుమారు రూ.20 నుంచి 40 వేల వరకు పెట్టుబడి అవుతోంది.

కిలో ధర రూ.100కు పైనే..

గత మూడు నెలలుగా మార్కెట్లో టమాట ధరలకు రెక్కలు వచ్చాయి. కాయ నాణ్యతను బట్టి గరిష్టంగా 15 కేజీల టమాటా బాక్స్ సుమారు రూ.1000 నుంచి రూ.1,400 వరకు పలికింది. కనిష్టంగా 15 కేజీల బాక్స్ సుమారు రూ.300 నుంచి 600 పలుకుతూ వస్తోంది. టమాట పంట సాగు చేసిన రైతుల ఇంట కాసుల పంట పండింది. మార్కెట్లో టమాటకు మంచి గిట్టుబాటు ధర పలుకుతుండడంతో ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజవర్గాల వ్యాప్తంగా టమాట పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు.

పంటకు తెగుళ్ల బెడద..

తుఫాను ప్రభావం, వాతావరణంలో మార్పుల కారణంగా టమాట పంటకు మచ్చ తెగులు, బూడిద తెగులు, ఆకుముడత తెగులు సోకాయి. మచ్చ తెగులుతో టమాట కాయలకు, ఆకులకు మచ్చలు ఏర్పడుతున్నాయి. ఆకు ముడత తెగులుతో టమాట చెట్టు ఆకులన్నీ ముడతలుగా మారి ఎండు ముఖం పడుతున్నాయి. బూడిద తెగులుతో చెట్టు నల్లబడి కుళ్ళుతోంది. తెగుళ్లతో టమాట చెట్టు ఎదుగుదల తగ్గిపోతోంది. ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. తెగుళ్ళ నివారణకు రైతులు ఎన్ని మందులు పిచికారి చేసిన తగ్గు ముఖం పట్టడం లేదు.

రైతుల ఆశలు ఆవిరి :

పంటకు తెగుళ్ల సోకకుండా దిగుబడి బాగుంటే ఎకరాకు 15 కేజీల బాక్సులు 500 వరకు అవుతాయి. అంటే 7500 కేజీల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో టమాట కాయ నాణ్యతను బట్టి 15 కేజీల బాక్స్ రూ.300 నుంచి 500 వరకు పలుకుతోంది. పెట్టుబడి, రవాణా ఖర్చులు పోను రైతుకు గిట్టుబాటే ఉంటుంది. కానీ తెగుళ్ళతో టమాట చెట్లు దెబ్బతిని దిగుబడి తగ్గిపోవడంతో టమాట పంటతో కాసుల పంట పండుతుందనుకున్న రైతుల ఆశలు ఆవిరై పోతున్నాయి. ఉద్యానవన శాఖ అధికారులు స్పందించి తెగుళ్ల నివారణకు తగు సలహా సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజక వర్గాల్లో టమాట సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం	టమాట సాగు విస్తీర్ణం ఎకరాల్లో..
ఉరవకొండ	3,100
కళ్యాణదుర్గం	4,200
రాయదుర్గం	5,150

రెండెకరాల్లో టమాట సాగు



మార్కెట్‌లో టమాటకు ధర బాగుండడంతో రెండెకరాల్లో టమాట పంట సాగు చేశా. రూ.50 వేల వరకు పెట్టుబడి అయ్యింది. పంట దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నా. కానీ పంటకు మచ్చ, బూడిద తెగుళ్ల సోకాయి. మందులు పిచికారీ చేస్తున్నా. తెగుళ్ల తగ్గలేదు. ఏం చేయాలో దిక్కుతోచడంలేదు. ఉద్యానశాఖ అధికారులు స్పందించి తెగుళ్ల నివారణకు సూచనలు, సలహాలు ఇవ్వాలి.

– వెంకటేష్, రైతు, అంతరగంగ గ్రామం, కూడేరు మండలం

రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా



యోధ, సాహిత వంటి వెరైటీ రకం టమాట నారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశా. సుమారు రూ.2 లక్షలకు పైగానే పెట్టుబడి అయ్యింది. తుఫాను, వాతావరణంలో మార్పుల కారణంగా టమాట పంటకు ఆకు ముడత, మచ్చ తెగుళ్ల సోకాయి. పంట దెబ్బతినకుండా ఉండేందుకు రూ.వేలు వెచ్చించాల్సి వస్తోంది. మందులు పిచికారీ చేస్తున్నా ఫలితంలేక పోతోంది. టమాట పంటపైనే ఆశలు పెట్టుకున్నా.

– రాజగోపాల్, రైతు, కమ్మూరు, కూడేరు మండలం

లక్ష్మీరంగనాథ స్వామి ఆలయంలో ఆర్డీఓ పూజలు


స్వామిని దర్శించుకుంటున్న ఆర్డీఓ రాణీసుస్మిత

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తి గ్రామంలో వెలసిన అతిపురాతన లక్ష్మీ రంగనాథ స్వామిని కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ అధికారి రాణీ సుస్మిత శనివారం దర్శించుకున్నారు. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా ఆర్డీఓ రంగనాథ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం ఆలయ ప్రాముఖ్యతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఈశ్వర్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆర్డీఓకు తీర్థ ప్రసాదాలు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కూడేరు: విజయవాడలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా నాయకురాలు విజయ నిర్మల డిమాండ్ చేశారు. శనివారం ఆమె కూడేరులో విలేకరులతో మాట్లాడారు. సాక్షాత్తూ రాజ్యాంగ నిర్మాత విగ్రహంపైనే దాడి చేయడం దారుణమన్నారు. దాడి జరిగి రెండు రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాజ్యాంగ నిర్మాతకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్పందించి, దుండగులు ఎంతటి వారైనా సరే అరెస్టు చేసి కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమ్య

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని రాయదుర్గం న్యాయమూర్తి రమ్య అన్నారు. శనివారం బొమ్మనహాళ్‌లోని కేజీబీవీలో మండల న్యాయ సేవ సమితి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి రమ్య విద్యార్థులతో మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చట్టాలపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరికీ చట్టాల గురించి తెలియాలని, న్యాయ అవగాహన సదస్సు కల్పిస్తామన్నారు. బాలికలు ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో విద్యావంతులుగా అయినప్పుడే చట్టాల పట్ల అవగాహన చేసుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలమ్మ, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'స్టాకు స్వాధీనం చేసుకోవడం సరికాదు'


స్టాకు స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన రెవెన్యూ సిబ్బంది

బెళుగుప్ప: తనను రెవెన్యూ ఉద్యోగులు వేధిస్తున్నారని, ముందస్తు నోటీసు ఇవ్వకుండా స్టాకు స్వాధీనం చేసుకుంటామనడం సరికాదని జీడిపల్లి 32వ చౌకధాన్యపు డిపో డీలర్ బ్రహ్మయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం బాధితుడు బ్రహ్మయ్య విలేకరులతో మాట్లాడాడు. గ్రామంలో తన తండ్రి తర్వాత తాను 45 ఏళ్లుగా డీలర్‌గా పనిచేస్తున్నానన్నాడు. డీటీ హుసేన్‌పీరా ఆధ్వర్యంలో ఆర్ఐ నగేష్, వీఆర్‌ఓలు గోవిందు, వీరాంజనేయులు శుక్రవారం చౌకడిపోను తనిఖీ చేశారన్నాడు. అయితే గ్రామంలో ఎండీయూ ఆపరేటర్ రాజీనామా చేయడంతో వీఆర్‌ఓ ఆధ్వర్యంలోనే తనకు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చిన 75.75 క్వింటాళ్ల బియ్యంలో 32.16 క్వింటాళ్లు కార్డు వినియోగదారులకు పంపిణీ చేసినట్లు తెలిపాడు. రెవెన్యూ అధికారుల తనిఖీలో అంతా సక్రమంగా ఉందని తేలినా, శనివారం ఉన్నపళంగా అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా చౌకదుకాణాన్ని లాక్కోవడం సరికాదన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయిస్తానన్నాడు.

భక్తిశ్రద్ధలతో నాగుల ప్రతిమలకు పూజలు


ఆలయం వద్ద హోమశాలను ఏర్పాటు చేసిన వేదపండితులు


కూడేరు: నాగుల ప్రతిమలు, పుట్టకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు: మండల వ్యాప్తంగా శ్రావణమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకొని నాగుల పుట్టలకు, నాగుల ప్రతిమలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. బియ్యం పిండి, నువ్వులతో చేసిన పిండి పదార్థాలను నైవేద్యంగా పెట్టారు. నాగుల ప్రతిమలకు, పుట్టలోకి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఉరవకొండ: పట్టణంలోని ప్రధాన నాగుల కట్టల వద్ద శ్రావణమాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకొని పాలు పోసి, పూజలు చేశారు. స్థానిక పాత కామన్నకట్ట వద్ద ఉన్న నాగులకట్ట వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని పుట్టకు పాలు పోశారు. అనంతరం మల్లేశ్వరస్వామి, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని రమణేపల్లిలోని అంజనేయస్వామి ఆలయంలో సీతా, లక్ష్మణ, అంజనేయసమేత శ్రీరామ చంద్ర విగ్రహాలకు శనివారం పూజలను నిర్వహించారు. ఆదివారం విగ్రహాల ప్రతిష్టతో పాటు ఆలయ గోపుర, ధ్వజస్తంభం, కలశ ప్రతిష్టాపన పూజలు నిర్వహించనున్నారు.

పీఏసీఎస్ మాజీ సీఈఓ మృతి


ఇమాంసాబ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి


ఇమాంసాబ్ (ఫైల్)

వజ్రకరూరు: మండల కేంద్రంలో వజ్రకరూరు సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)మాజీ సీఈఓ ఎస్. ఇమాంసాబ్ (70) శనివారం ఆకస్మికంగా మృతిచెందారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వజ్రకరూరుకు చేరుకొని ఇమాంసాబ్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వజ్రకరూరు పీఏసీఎస్ అధికారులు, సిబ్బంది ఇమాంసాబ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డీఎస్పీ సేవలు మరువలేనివి


డీఎస్పీ శ్రీనివాసులును సన్మానిస్తున్న సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్: డీఎస్పీ శ్రీనివాసులు సేవలు మరువలేనివని సిబ్బంది కొనియాడారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో డీఎస్పీగా పనిచేసే శ్రీనివాసులు బదిలీఅయ్యారు. ఈ సందర్భంగా స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులును శనివారం సన్మానించారు. ఆయనకు జ్ఞాపికలు అందజేశారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని వినతి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం జంక్షన్‌లో నూతన రైల్వేస్టేషన్ అందుబాటులోకొచ్చిందని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పార్లమెంట్ సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణకు వినతి పత్రం పంపినట్లు చెప్పారు. ప్లాట్‌ఫారం పరిధి తక్కువగా ఉందని స్టాప్ చేయలేదని, ప్రస్తుతం ప్లాట్‌ఫాం అభివృద్ధి చెందిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రాయదుర్గం మీదుగా రాకపోకలు సాగించే టాటానగర్, వారణాసి రైళ్లను నిలపాలని కోరారు.

డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం రాక


సర్వాంగ సుందరంగా ముస్తాబైన డిగ్రీ కళాశాల ముఖద్వారం

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా ముస్తాబు అయ్యింది. ఈనెల 19, 20 తేదీల్లో న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం సందర్శించనుంది. న్యాక్ బృందం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానంగా బోధిస్తున్న సిలబస్, బోధనా పద్ధతులు, పరిశోధనలు, సదుపాయాలు, ఉత్తమ పద్ధతులు, పరిపాలన తదితర అంశాలపై సమగ్ర వివరాలు సేకరించనుంది. ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1980లో ప్రారంభమైంది. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి, బోధనా పద్ధతుల్లో మార్పులు, ప్రవేశపెట్టిన కోర్సులు, దాతల సహకారంతో వసతుల కల్పన తదితర అంశాలపై కీలకంగా చర్చించనున్నట్లు సమాచారం. గతంలో 2016 ఫిబ్రవరిలో కళాశాలకు ఇది వరకే న్యాక్ బృందం పర్యటించి, 2.02 పాయింట్లతో 'బి' గ్రేడ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈసారి కళాశాలకు ఏ గ్రేడ్ సాధించి అత్యధికంగా నిధులు రాబట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణతో పాటు అధ్యాపకులు కృషి చేస్తున్నారు. రెండు రోజుల పాటు న్యాక్ బృందం కళాశాల రికార్డులు, జరిగిన అభివృద్ధిని పరిశీలించనున్నట్లు తెలుస్తోంది.

వైభవం.. వీరభద్రస్వామి రథోత్సవం


ఉత్సవమూర్తుల ఊరేగింపు

విడపనకల్లు: మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉండబండలో వెలసిన వీరభద్రస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఈఓ రమేష్‌బాబు, అన్నదాన కమిటీ చైర్మన్ దండిన శివానంద, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు రుద్రప్ప, శశిధర్‌గౌడు, వీరభద్రచారి నేతృత్వంలో నిర్వహించిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా వీరభద్రస్వామి భద్రకాళి ఉత్సవమూర్తులను మేళతాళల నడుమ ఊరేగించారు. రథంలో ఆసీనులను జేసి ఉత్సవం ప్రారంభించారు. ఉండబండ, పాల్తూరు, చీకలగురికి, విడపనకల్లు, కరకముక్కల, గాజుల మల్లాపురం గ్రామాల నుంచి కాకుండా ఉరవకొండ, కర్ణాటక బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కుదేకార్ రుద్రప్ప లత, ప్రకాష్, సుమ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం

విడపనకల్లు: మండల పరిధిలోని ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ఆలయ అన్నదాన కమిటీ చైర్మన్ దండిన శివానంద, దండిన సులోచన దంపతుల ఆధ్వర్యంలో వీరభద్రస్వామి, భద్రకాళికా దేవీలకు కల్యాణోత్సం జరిపించారు. అంతకుముందు నిత్యార్చన, అగ్నిగుండ, మహాన్యాస, రుద్రాభిషేకం, మహాబలి, పూర్ణాహుతి , మంగళహారతి, లీలావైభవం పూజలు చేశారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం అందించారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు రుద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం


స్వామివారి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విగ్రమలై లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రమణ్యంస్వామి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీసమేత స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకులపూజ, నైవేద్య పూజలు జరిపించారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకీలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దాత రాధమ్మ సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కోశాధికారులు నరసింహులు, సత్యనారాయణ, కార్యదర్శి గురు రాఘవేంద్ర, సభ్యులు గురునాథరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

నేమకల్లుకు పోటెత్తిన భక్తులు


అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


108 కలశాలతో పూజలు చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. స్వామికి సుప్రభాతసేవ, పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వెండి కవచధారణ, వెండి తమలపాకు అలంకరణ, ప్రత్యేకాలంకరణ, ఆకు పూజలు, తులసీమాలధారణ, ప్రత్యేక పుష్పాలకరణ చేసి, మంగళహారతి ఇచ్చారు.

కూడేరు: శ్రావణమాసం తొలి శనివారాన్ని పురస్కరించుకొని కూడేరుకు సమీపంలో ఉన్న బసాపురం ఆంజనేయస్వామి ఆలయం, కూడేరులోని, రామదుర్గం ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. బసాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో సాయంత్రం ఆంజనేయుని ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో భక్తులు నియమనిష్టలతో ఆలయాల్లో కుంకుమార్చన, ఆకుపూజ, సహస్రనామార్చన, మహామంగళహారతి పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

కణేకల్లు: బిదరకుంతంలోని ఈశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో గరుడస్తంభం ప్రతిష్టను పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గోపుర కలశాలకు అర్చకులు పూజలు నిర్వహించారు. ఊరేగింపు సమయంలో వీరభద్రుడి వేషధారుడి వీరగాసే నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయాల్లో గణపతి హోమం, రుద్రహోమం, మారుతి, జయాధి హోమాలు నిర్వహించారు. ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, రెండు ఆలయాల్లో గరుడ స్తంభాలను ప్రతిష్టించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వైభవంగా శ్రీవారి పల్లకీసేవ


పెన్నహోబిలంలో శ్రీవారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి పల్లకీసేవ శనివారం జరిగింది. దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం, మహామంగళహారతి, కుంకుమార్చన చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో ఉంచి, ఆలయ వీధుల్లో ఊరేగించారు. పెన్నహోబిలంలో పెళ్లిళ్ల సందడి నెలకొనడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.